## నిధుల మంజూరులో ప్రభుత్వం పక్షపాత ధోరణి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోవడంతో నిధులు మంజూరు చేయడంలో పక్షపాతి ధోరణి అవలంభిస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, కొంత మంది ఉన్నతాధికారులు కాంగ్రెస్ నాయకులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో ఇక్కడ ప్రజలపై కాంగ్రెస్ కక్ష కట్టిందని, అందుకే అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారుల వద్దకు వెళ్తే ప్రజలను పట్టించుకోవడం లేదని అన్నారు.కనీసం ఎమ్మెల్యే నిధులు కూడా విడుదలకు నోచుకోవడం లేదని, అభివృద్ధిలో వివక్ష చూపించడం తగదన్నారు.గతంలో చిన్నపాటి వర్షాలకే కాలనీలు ముంపునకు గురయ్యేవని తమ హయాంలో అలాంటి సమస్యలకు చెక్ పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి, మాధవరం నర్సింహారావు, గంగం శివశంకర్, ముద్దగౌని సతీష్‌గౌడ్, జగన్మోహన్‌రావు, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రధానోపాధ్యాయరాలు విజయలక్ష్మితో పూర్వ విద్యార్థులు

మలక్‌పేట: మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1969 బ్యాచ్‌కి చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులను సన్మానించారు. కేఎస్ కుమార్, సీవీ లక్ష్మీ, ప్రభాకర్, రామకృష్ణరావు ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో 10వ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు స్టేషనరీ, 40 మందికి యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కేఎస్ కుమార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ బ్యాచ్ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. చదువుతోనే జీవితాలలో మార్పు వస్తుందని, బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అనురాధ, అడపాల నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# పదిపై స్పెషల్ ఫోకస్

**వంద శాతం లక్ష్యంగా ప్రత్యేక తరగతులు**

- ప్రతిరోజూ ఇంటివద్దే విద్యార్థులు చదివేలా ప్రణాళిక



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడుల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులపై విద్యాశాఖ స్పెషల్ ఫోకస్ పెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు దీటుగా సర్కారు బడుల్లోని విద్యార్థులు పోటీ పడేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

**వేకువజామునే పుస్తక పఠనం..**

అక్టోబర్ నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న విద్యాశాఖ డిసెంబర్ నుంచి ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా ఉపాధ్యాయులతో మానిటరింగ్ చేస్తుంది. ప్రతి రోజూ వేకువజామునే విద్యార్థులు నిద్రలేచి పుస్తక పఠనం చేసేలా చర్యలు తీసుకుంటోంది.

**విద్యార్థుల శ్రద్ధపై సమీక్ష..**

వారంలో ఒకటి, రెండుసార్లు తల్లిదండ్రులతో టీచర్లు ఫోన్‌లో తమ పిల్లల చదువుపై చూపుతున్న శ్రద్ధను తెలుసుకుంటూనే వెనుకబడిన సబ్జెక్టుల్లో సాధించిన ప్రగతిని పేర్కొంటున్నారు. దీంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై మరింత దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**వసతుల కల్పనపై చర్యలు..**

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను పెంచడంతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. 'మన బడి-మన ఊరు-మన బస్తీ' కార్యక్రమం కింద గత ప్రభుత్వం జిల్లాలో 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించింది.

- అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలతో 286 పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు, అభివృద్ధి పనులను చేపట్టింది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేస్తున్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వసతి కల్పిస్తున్నారు.

**'మేడ్చల్ బడి'కి ఆదరణ..**

'మేడ్చల్ బడి' యాప్‌తో రూపొందించిన అన్ని తరగతుల పాఠ్యాంశాలతో విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ క్లాసులు రాష్ట్ర స్థాయిలో మంచి ఆదరణ లభించింది. జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో చేపట్టిన పుస్తక పఠనం'( రీడింగ్ క్యాంపెయిన్) కూడా విద్యార్థులు సెల్‌ఫోన్ల నుంచి కొంత మేరకు వైదొలిగేలా చేసింది. మేడ్చల్ జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 507 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8 వేల మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2024లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు.

**ఇంటి వద్దే చదువుకునేలా చర్యలు..**



పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ఇంటి వద్ద కూడా వేకువ జామున విద్యార్థులు చదువుకునేలా టీచర్లు మానిటరింగ్ చేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లపైనా దృష్టి పెట్టాం. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా నోట్స్ తయారు చేసి ఇస్తున్నాం.

– విజయకుమారి, డీఈఓ, మేడ్చల్‌జిల్లా

**వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్ క్లాసులు..**

మేడ్చల్ జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువ మంది ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, ఇంగ్లిష్, సామాన్యశాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

## చట్టం ముందు అందరూ సమానమే



శ్రీతేజ్ కుటుంబ సభ్యులతో దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: చట్టం ముందు అందరు సమానమేనని ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎంతటి వారైనా చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సంధ్య థియేటర్‌లో పుష్ప సినిమా చూడటానికి వెళ్లి గాయపడిన చిన్నారి శ్రీతేజ్‌ను ఆదివారం కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అన్ని విధాల అండగా ఉంటుందని పేద, ధనిక తేడా లేకుండా అందరికి సమాన్యాయం దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి..**

లింగోజిగూడ: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని బృందవన్ కాలనీలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పూజలో శివగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్ రావు, అఖిల్‌గౌడ్, రమాకాంత్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న గౌరీ శంకర్

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీహాల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన బైండ్ల భవనీయ సంఘం హైదరాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏపూరి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉప్పునూతల నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి వర్ధల రాజేష్, కోశాధికారి చిట్టంపల్లి కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ.. బైండ్ల కులస్తుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఈ సమావేశంలో ఏర్పుల భాస్కర్, ఏర్పుల గాలయ్య, ఇంద్రపల్లి సంజీవ, ఏపూరి యాదగిరిరావు, చిట్టంపల్లి సాయిరామ్, ఏపూరి లక్ష్మణ్‌రావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కామన్ డైట్ మెనూ పూర్తిస్థాయిలో అమలు చేయాలి



మహేష్ కుమార్‌ను సన్మానిస్తున్న హాస్టల్ విద్యార్థులు

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కామన్ డైట్ మెనూ పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ అన్నారు. మూసారంబాగ్ కట్టెలమండి హాస్టల్లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమస్యలు తెలుసుకోవడానికి మలక్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను సందర్శించినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, వర్కర్ల జీతాలు, భవనాల అద్దెలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత శాఖ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశామన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలో మెరుగైన వసతులు కల్పించి, సర్కార్ బడులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మేడిరాజు, ఈర్లప్రసాద్, మచ్చసుధాకర్, సతీష్, తరుణ్, ఉదయ్, శివ, భాను పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

చైతన్యపురి: పౌర్ణమి సందర్భంగా లక్ష్మీనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చైతన్యపురి కనిగిరి కాలనీలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం నిర్వహించిన హోమంలో గురుమాతా శ్రీ దివ్యరమణ చక్రవర్తుల పర్యవేక్షణలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణంతో హోమం జరిపారు. అనంతరం శ్రీగోదారంగనాధుల కల్యాణ పత్రికను ఆవిష్కరించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి డైరెక్టర్ రమణ చక్రవర్తుల, సహస్ర, చంద్రశేఖర్, శివానంద అగర్వాల్, కొండల్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను తిలకిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ఆలోచన శక్తిని పెంచుతాయని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. సాయిలాల్‌తోటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులోని ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలను ప్రయోగాత్మక ఆలోచనల వైపు మళ్లించాలన్నారు. అత్యుత్తమ నమూనాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్య స్వాతి, ఉపాధ్యాయులు వాణి, నిఖిత, లత, నాయకులు బండ వెంకట్‌రెడ్డి, యోగి పాల్గొన్నారు.

### ముగిసిన గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం అల్కాపురి శ్రీ శృంగేరి శంకరమఠంలోని గురుదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, 108 కళశాలతో వివిధ నదీ జలాలతో దత్తాత్రేయ స్వామికి అభిషేకాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ కుప్పా శ్రీనివాస్ శాస్త్రి దత్తవైభవంపై ప్రవచనాలు చేశారు. దత్తాత్రేయ స్వామిని ఆరాధించే భక్తుల కోసం అనేక రూపాలతో దర్శనమిచ్చే స్వామి దత్తాత్రేయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో శృంగేరి శంకర మఠం బ్రాంచ్ హెడ్ క్రొవ్విడి శ్రీనివాస్, కె.ఎస్ మూర్తి, గౌరీ భాస్కర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఆదిత్యకు ఆర్థిక సాయం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: వరల్డ్ క్యారం బోర్డు పోటీలో మూడో స్థానం సాధించిన ఆదిత్యకు దేప ఫౌండేషన్ ద్వారా రూ. 25 వేల చెక్కును సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఆదిత్యకు వరల్డ్ క్యారం బోర్డు పోటీలో మూడోస్థానం రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, ఉపేందర్ రెడ్డి, గడ్డి అన్నారం డైరెక్టర్ బండి మధుసూదన్, దేపమల్లారెడ్డి, కె ఎస్ మూర్తి, పగడాల శ్రీశైలం, రాజగోపాల్, విప్లవ రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

### నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మన్సూరాబాద్: విజయశ్రీకాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి జనవరి 14 వరకు గోదా రంగనాథస్వామి ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చీర్ల నర్సిరెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 లకు అర్చన, తిరుప్పా వై సేవాకాలం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2న వేంకటేశ్వరస్వామి మాస కల్యాణం, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం,11న కూడారై ఉత్సవాలు, 13న గోదా రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

### రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు. టమాట రూ. 15, వంకాయ రూ. 23, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 23, కాకర రూ. 30, బీర రూ. 55, క్యాబేజి రూ. 19, ఫ్రెంచిబీన్స్ రూ. 50, క్యారట్ రూ. 37, దొండ రూ. 35-40, చిక్కుడు రూ. 40, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 35, క్యాప్సికం రూ. 55, ఆలు రూ. 33, దోస రూ. 13, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 47, చామగడ్డ రూ. 35.

ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.



## యోగాతో ఆరోగ్యం పదిలం



యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: నిత్యం యోగా చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ప్రజానివాస్ ఫేస్-1లో ఆదివారం భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉచిత యోగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసిన భారతీయ యోగా సంస్థాన్ వారికి ధన్యవాదాలు అన్నారు. ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రజానివాస్ ఫేస్-1లో ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సురేష్, లింగేశ్, ఫణింద్ర, సృజన, సుకన్య పాల్గొన్నారు.

## ఘనంగా పీవీటీ మార్కెట్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న సభ్యులు

హుడాకాంప్లెక్స్: కొత్తపేటలోని పీవీటీ మార్కెట్ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేసిన అనంతరం మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడు కైరంకొండ ధనుంజయ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా వినియోగదారులు, హోల్‌సేల్ వ్యాపారస్తులు పీవీటీ మార్కెట్‌పై నమ్మకంతో వస్త్రాలు కొనుగోలు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొడ్డు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి భువనగిరి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి తడక కృష్ణ, కోశాధికారి చెరుకు భిక్షపతి, డైరెక్టర్లు ప్రసాద్‌కుమార్, సురేశ్, పోచయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మెట్రో ఏర్పాటు చేయాలని వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో నాయకులు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తా మీదుగా మెట్రో రైలు లైన్ వెళ్లే విధంగా చూడాలని బీజేపీ నాయకులు ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎల్‌బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు నిర్మిస్తున్నందున, దీన్ని బాలాపూర్ చౌరస్తా మీదుగా ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకుని మెట్రో ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, భిక్షపతిచారి, గౌరీశంకర్, గాజుల మధు, సోమేశ్వర్, చెవ్వ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రానికి నూతన అధ్యయనాన్ని రచించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్‌లోని ఆల్ఫోర్స్ కేంద్రం కార్యాలయంలో రామానుజన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్-2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి రామానుజన్ మార్గాన్ని అనుసరించి గణితంలో అద్భుతాలు సృష్టించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒలింపియాడ్-2024ను అట్టహాసంగా తెలంగాణ, మహారాష్ట్రలోని విద్యాసంస్థల్లో నిర్వహించినట్లు తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 22న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

### నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్‌కాలనీ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరివర్ధన్, కోశాధికారిగా అల్వాల్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తమ కాలనీలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మణిపాల్‌రెడ్డి, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పీఆర్‌సీ శర్మ పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గానికి చెందిన 68 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### సన్మానం



పాశం యాదగిరిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నాగోలు: తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరిని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కలిసి సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం స్వాగతిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం 250 గజాల స్థలం, గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోర శ్యామ్‌సుందర్ గౌడ్, మారోజు రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

### అనాథలకు చేయూత



టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ జన్మదినం సందర్భంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్నేహపురికాలనీ అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ అనాథ విద్యార్థి గృహంలో నోటు పుస్తకాలు, పెన్నులు, పండ్లు అందజేశారు. – నాగోలు

### డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

పహాడీషరీఫ్: ఇళ్ల మధ్య నెలకొన్న మురుగు సమస్యకు మున్సిపల్ అధికారులు పరిష్కారం చూపారు. జల్‌పల్లి గ్రామం వీకర్ సెక్షన్ కాలనీలో కొద్ది రోజులుగా డ్రైనేజీ సమస్య తలెత్తగా.. సమస్యను కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతకింది నవీన్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కమిషనర్.. ఆదివారంగల్పర్ యంత్రంతో వ్యర్థాలను సిబ్బందితో తొలగింపచేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ కేంద్రం జల్‌పల్లి లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లను విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఆదిల్ల మహేశ్, సూపర్‌వైజర్ కుమార్‌లు పాల్గొన్నారు.